# కుటుంబతరంగిణి—౭
(పరిచయంకోసం)

కవికొండల వేంకటరావుగారు

"పరిచయంకోసం ఏం తంటాలుపడి పోతున్నాయి ఈ హృదయం, ఈ కళ్లు, ఈ నొసలు, ఈపెదవులు, ఈమనస్సు, ఈఆత్మ." అని అనుకొన్న తనసంగతి తన కనుతెప్పలనన్నా వాటివాటి చిట్టి చిట్టి చిటికె చిటికె చప్పుళ్లుగుండా వెల్లడిపఱుపనీనంత నిశ్శబ్దంగా చటక్కున నోమాటు కన్ను వీథికేసి మలసి, నత్తల్లే యింట్లోకి వెళ్లి పోయింది, అరుంధతి. దానిలో నేముంది అంటే ఎవరూ ఏమాటా చెప్పలేరు గాని, 'ఏమైనా ఉండకుండా వుంటుందా' అని నిజంగా తెలిసికోవాలనే కుతూహలంకొద్దీ గమనిస్తే మాత్రం ఏదో ఉండకుండాపోదని నా తాత్పర్యం.

కన్ను వీథివైపు మలపితే మలపవచ్చును గాని, నత్తలాగు ఇంట్లోకి జాఱటాని క్కారణం ఏముంటుంది? లోకమంతా మురిసిపోయే అందం ఆ అరుంధతిది. ఆమెకు భయమెందుకు? లోకమంతా జిలిబిలిపుచ్చే ముద్దుపలుకు ఆ అరుంధతిది. ఆమె కంత ముగ్ధత్వమెందుకు? లోక మంతను వెల్లడికి దెచ్చే కళాకాంతులు ఆ అరుంధతివి. ఆమె కంత తబ్బిబ్బు ఎందుకు?—ఓ మగవాడు ఆచూపులో తనచూపు ఆక్షణమందు చటక్కున గలిపినాడు. అది వినా మఱొకకారణం కనిపించదు—ఆబిడ ఆఫక్కి నొక్కుమ్మడి సర్వేంద్రియాలు లోనికి లాగుకొను తాంబేలు మచ్చుగా కొంచివేసికొని తిరోహిత అగుటకు-అది వినా మఱొకకారణం కనిపించదు. ఆ మగవా డెవరూ అంటే పేరు మనకు తెలీదు. ఊరు మనకు తెలీదు. నవలల్లో అనేటట్టు క్రొత్తపురుషుడు అని అనుకోవాలి, అంతే.

ఆ క్రొత్తపురుషుడు ఆ వెళ్లడం వెళ్లడం ఆవీథికొనకంటా వెళ్లి తిరిగి వెనక్కు మళ్లి వచ్చినాడు. తిరిగి మళ్లివచ్చేలో అదివఱకరుంధతి నించున్న గుమ్మంలో అరుంధతి లేదు. ఆగుమ్మం శూన్యంగా వుంది. గుమ్మం శూన్యంగా వుండడంలో అతని హృదయం ప్రేమశూన్య మైపోయిన ట్టయిపోయి ఓఘుడియ, తాఱుమాఱుగా ఎదర గుమ్మంకేసి, పక్క గుమ్మంకేసి చూస్తూ కళ్లను బండికండ్లల్లా త్రిప్పేశేడు. ఎవరూ కనబడలే. 'ఇదేనా ఇందాకా చూచిన గుమ్మం?' అని ఏదో ఆనవాలుగా తెలిసికోని, 'ఇదే' అని అనుకోని ఒక్కొక్కమెట్టే ఎక్కుతూ లోపలకు చొఱబారి, పరికిస్తూవున్నా 'డెవరైనా వస్తారా పలుకరిద్దామా' అని.—ఎవరూ రాలేదు గాని అతనికి చూచాయగా లోలోపల ఒకమంచంమీద ఒక వనిత పరున్నట్టు గోచరించింది—వనితా? లేక వనితయొక్క పవళింపు ప్రతిమా అనే సంకోచం గలిగింది,

అతను తన కనురెప్ప వ్రాల్చి తిరిగి యెత్తడం లో.—పట్టెమంచం, అందుమీద పరుపెత్తు, పరుపెత్తుమీద కలంకారా దుప్పటీ, దుప్పటి మీద తలాటిదిక్కున రెండు తలగడాలు తెల్లనివి, జాలరు వోసిన గలేబులు తొడిగినవి ఎత్తుగా ఉంచబడి యున్నాయి. ఆతలగడాల మీద ఆవనిత మోమానుకొని బోర్లా పరుండి చేతులు రెండూ తలగడాలను కావిలించు



"ఆ తలగడాలమీద.........బోర్లా పరుండి"

కొన్నట్లుంచి, జబ్బలయొక్క గుండ్రందనము, నవకము, పొందిక, .చాయ చూపఱకు వదలి వైచి, గడ్డం తలగడలపై నాని, మోమెత్తి ఱెప్ప లఱవాల్చి నిశ్చేష్టత నుంది, అప్పటి కప్పుడే. అది శిల్పం అనుకోక ఒకడుమాత్రం నిజంమనిషి. అని అనుకోవడం ఏలా? తల్పం మీద ఇటూ అటూ జోగితేగా, ఇటూ అటూ జరిగితేగా?

క్రొత్తపురుషుడు 'తనకేసే చూస్తోంది ఆస్త్రీ' అని అనుకున్నాడు. మళ్లీ అనుకు న్నాడు, "రవంత తన్ను చూంచియుంటే లేచి నిలబడదా? జంకనైనా జంకదా? కొంకనైనా కొంకదా?" అని. అ జంకకపోవడం, కొంకకపోవడం మఱింత బలపఱిచింది నిజంగా చెక్కడపుబొమ్మ నని.

ఒకనిమిషం మవగాహన కవకాశం వుంచుకుంటేగా— క్రొత్త పురుషుడు గిరుక్కున మళ్లి వీథిగుమ్మం దాటివచ్చి, దాటుతో గుమ్మంతలుపు అంకె గుర్తించుకొని, తెట్టతెన్నే ఇంకా నడచి, వీథి చివర వీథి పేరుగుర్తించుకొని, "ఇసుక పల్లివారి వీథి, ౧౦౩ ఇల్లు అదే. కాని నిరర్థక మైపోయింది వెళ్లడం" అని అనుకొన్నాడు.

క్రొత్తపురుషుడు తిన్నగా ఒకగమ్య స్థానానికి జేరుకొని "ఆర్యా! నన్ను మోసపుచ్చినావు. ఇంట నెవ్వరూ లేరు." అన్నాడు అవతలో పెద్దమని షితో.

ఆపెద్దమనిషి యాక్రొత్తపురుషుని వెంటనే నఖశిఖపర్యంతం చూచి. "లోపలకు వెళ్లినారా? తలుపుతీసి లేదండీ? లోపల ఆ అమ్మాయి లేదండీ?" అని అడిగినాడు. "అమ్మాయి యేమిటి గాని ఆవిడ—ఆవిడే

అనుకుంటాను—గుమ్మంలో నిలబడి కనిపించింది ముందు. ఆవెంటనే ఆగుమ్మం ఆలా ఎక్కితే బాగుండదని వీథిచివరకు వెళ్లి తిరిగి వచ్చినాను. ఆలోపున గుమ్మంలో ఎవరూ కానరారు. ఎవరును లేరు గదా అని లోపలకు వెళ్లినాను. ఎవరూ ప్రత్యక్షం గాని, మాట్లాడ్డం గాని కనబడలేదు, వినబడలేదు. వెనక్కి వచ్చేశా" నన్నాడు, మన క్రొత్తపురుషుడు. "లోప లెవరూ మీ కక్కనిపించ లేదూ?" అన్నాడు మళ్లీని ఆ పెద్దమనిషి. "ఇదంతా దగాలాగు తోస్తుంది" అన్నాడు క్రొత్తపురుషుడు. "ఏదంతా?" అన్నాడు పెద్దమనిషి. "ఈవార్తాపత్రికలో 'సొగసైన పిల్ల, చదువుకొన్నపిల్ల, ౧౮ ఏళ్లపిల్ల పెళ్లికుంది. వలసినవారు—పెద్ద మనిషి సంరక్షణలో, ఇసుకపల్లివారి వీథి, ౧౦3 నెం. ఇల్లు' అని వ్రాసిందంతా" అన్నాడు క్రొత్తపురుషుడు. పెద్దమనిషి వెంటనే "నీకు వరించడం తెలీక పైపెచ్చు నన్ను దగాకోరంటావు? ఆపె అక్కడనే వుండాలి. నేను చెప్పి వచ్చినాను 'ఒకరొస్తారు చూచుకోవలసింది' అని. ఆమె అక్కడ లేకపోవడమంటూవస్తే ఆమె నన్నూ నిన్నూ కూడా దగాచేసి వుండాలి" అన్నాడు.

అంటూ వెంటనే ఆపెద్దమనిషీన్నీ, యీ క్రొత్తపురుషుడున్నూ పైని వివరించిన ఇంటికి వెళ్లినారు. పెద్దమనిషి లోపలకు వెళ్లడంతోనే, "అరుంధతీ! అరుంధతీ!" అని కేకేసినాడు. లోపల నుంచి అరుంధతి నడవలోకి


"పెద్దమనిషి వెంటనే...అన్నాడు క్రొత్తపురుషునితో."

వచ్చి "ఇక్కడున్నాను" అంది. పెద్దమనిషి వెంటనే "ఇక్కడుంటేనండీ?" అన్నాడు క్రొత్తపురుషునితో. వెంటనే అరుంధతివైపునకు దిరిగి "వీరే నే నన్నవారు. వార్తాపత్రికప్రకటన చూచి నిన్ను వరింప వచ్చినారు. వీరిప్పుడిలా మనింటికి వచ్చినారట. నీ వెందరిగినావు?" అని అన్నాడు. అరుంధతి అంది, "ఎక్కడికీ వెళ్లలేదే, యీ మంచం మీద పరుండి యున్నాను" అని. క్రొత్తపురుషుడు "ఆ పడుకున్నవారు మీరేనా? నే నది శిల్పి చెక్కడ మనుకున్నా" అన్నాడు. పెద్దమనిషి "శిల్పం అనుకోడానికి మనిషిచలనమన్నా పోల్చలేకపోతివయ్యా,

సామీ!" అన్నాడు. అరుంధతి "మీరు కారు వచ్చింది. మీరు వస్తే పోల్చలేక పోయినా దాన్నా? మీ రంతక్రితమే ఆలా వీథంట వెళ్లినట్లున్నారు" అంది. క్రొత్తపురుషుడు "అవును వెళ్లినాను" అన్నాడు. "మీరు కాక ఆలోపల మఱెవరు వచ్చినారు" అన్నాడు పెద్దమనిషి.

అనేసరికి అరుంధతి సామాన్య స్త్రీలా నిరుత్తర గాక, "అతడే, ఆ గోపాలుడే, ఆ గోపికాలోలుడే—ఆవేణు వూదుకుంటూనే" అంది. పెద్దమనిషి నమ్మలేక పోయినాడు. క్రొత్తపురుషుడు అర్థంచేసుకోలేకపోయినాడు. పెద్దమనిషి, "ఆర్యా! మీరు వచ్చినవేళ మంచిది కాదు. మీరు గుమ్మంలో ఆమెను చూచినప్పుడే ఇంటిసంఖ్య గుర్తించి లోపలకు వెళ్లి పలుకరించవలసి యుండేది" అన్నాడు. క్రొత్తపురుషుడు "నే నాచివరకు వెళ్లి తిరిగి వచ్చే ఇంతలోనే అంత వైరాగ్యం ప్రబలి వుంటుందా?" అన్నాడు. పెద్దమనిషి "వైరాగ్యం కాదు. ఆమె మఱొకర్ని గుఱించి యోజిస్తూ వుండవచ్చును" అన్నాడు. క్రొత్తపురుషుడు 'సెల విప్పించండి' అని కూడా అనకుండా వచ్చినదార్నే వెళ్లిపోయినాడు.

ఆ అరుంధతికి నాటికీ నేటికీ వివాహం కాలేదు. ఆమెహృదయం నాటికీ నేటికీ అనన్యార్పితం.

పెద్దమనిషి యెప్పుడన్నా అరుంధతిని "నీ వానాడు వచ్చిన క్రొత్తపురుషుని ప్రేమించినావా?" అని ఓమాటంటే, "ప్రేమించకేం? వెళ్లిపోయినాడు గిరుక్కున. నే నీలోకంలో ప్రేమించిన్నుంటే ఆయన్నే" నంది.



"మఱెందు కాలా! గోపాలుడు.........అని అడిగితే"

"మఱెందు కాలా గోపాలుడు కనబడ్డాడని బొంకినావ్?" అని అడిగితే, "నాహృదయ పరిణామముయొక్క సత్యమును చెప్పినాను" అంది. "ఒక స్త్రీ ఒక మగవానిని ప్రేమించింది అంటే ఆ స్త్రీ ఆమగవాణ్ణితప్ప దేవుణ్ణి అయినా ప్రేమించినట్టు చెప్ప వలను గాదు. అదీ ప్రేమరహస్యం" అన్నాడు పెద్దమనిషి.

అయితే అటువంటి వివాహం నాకక్కఱలేదంది అరుంధతి.